

# బంధం

పోస్ట్‌మాన్ తలుపు తట్టాడు "పోస్ట్" అంటూ.

చంద్రశేఖర్ వాకిట్లోకి వెళ్ళి పోస్ట్ అందుకున్నాడు. ఒకటి కార్డు, మరొకటి కవరు. కార్డు అతని పేరున వచ్చింది. కవరు అతని తల్లికి.

తను వుద్యోగానికి సెలక్టుకానందుకు విచారిస్తూ ఒక పెద్ద కంపెనీవాళ్లు పంపిన రిగ్రెట్ కార్డు అది. అది చదివి కసిగా చింపి ముక్కలుచేసి గాల్లోకి విసిరాడు.

"ఏమిట్రా అది చింపి ముక్కలు చేస్తున్నావ్?" అంటూ వచ్చింది సావిత్రి.

"మామూలే.." అన్నాడు తల్లి చేతిలో కవరు వుంచుతూ.

ఆ వుత్తరం చదువుతూనే సావిత్రి మనసులో తుఫాన్ చెలరేగింది. ముఖం వాడిపోయింది. ఆమె పెదవులు కంపించాయి. ఏడుపు ముంచుకొచ్చింది.

"ఒరే బాబూ!" అంది హీనస్వరంతో.

"ఏమిటమ్మా?" కళ్ళు పెద్దవిచేసి ఆందోళనతో అడిగాడు చంద్రశేఖర్.

"మీ నాన్నకి ఏమీ బాగోలేదట. వెంటనే బయల్దేరి రమ్మని రాయించాడు," అంది అతికష్టంమీద గొంతు పెగల్చుకుని. చంద్రశేఖర్ తీవ్రంగా చూశాడు తల్లి వంక.

తండ్రిని తలుచుకునేసరికి చంద్రశేఖర్‌కి జ్వరం వచ్చినట్లయి ఒళ్ళు వేడెక్కి పోయింది. ముఖం జేవురించింది కోపంతో. కళ్ళలో ఎర్రజీరలు కనిపిస్తున్నాయి.

"అయితే ఏమంటావ్?" అన్నాడు.

"మనం వెంటనే వెళ్ళాలిరా?" అంది సావిత్రి.

"వెంటనే వెళ్ళాలా? ఎందుకూ?"

"ఎందుకేమిట్రా? వెళ్ళాలి. అంతే."

"అంతే.. వెళ్ళాలి! జరిగిదంతా మర్చిపోయా వన్నమాట," అన్నాడు అతను. తండ్రిమీద కోపంతో వుక్కిరి బిక్కిరౌతున్నాడు.

సావిత్రి కొడుకువంక చూస్తూ చిత్తరువులా నిల్చుండిపోయింది.

తల్లి ఏమీ మాట్లాడకపోయేసరికి తలెత్తి చూశాడు.

పాతబడి కళాకాంతులు పోయి, అక్కడక్కడా రంగులు పెచ్చులూడిన మట్టిబొమ్మలా వుంది ఆమె.

ఆమె అనుభవించిన నికృష్ట జీవితాన్ని చాటిచెప్తున్న కళ్ళక్రింది నల్లటి చారలు, ముఖంలో పడిన ముడతలు, నెరసిన జుట్టు.....

తలవంచుకున్నాడు చూడలేనట్లుగా.

"అంతా మర్చిపోరా బాబూ! ఈ సమయంలో మనం వెళ్ళి తీరాలి. ఈ వుత్తరం చదువు. మనల్ని చివరిసారిగా చూడాలని ఎంత ఆరాటపడుతూ రాశారో!" అంది ఆమె.

"ఇన్నాళ్ళూ ఈ ఆరాటం ఏమైపోయింది? భార్యా పిల్లలమీద ప్రేమ ఇప్పటికి గుర్తొచ్చిందా?" వెటకారంగా అన్నాడు.

తండ్రి చేసిన ఘోరం అతను మర్చిపోలేకుండా వున్నాడు. తల్లి ఎలా అదంతా మర్చిపోగలుగుతుంది?

'ఛీ... ఈ ఆడవాళ్ళ రక్తమే అటువంటిది' అనుకున్నాడు చంద్రశేఖర్.

"నాయనా కాలం ఎటువంటి గాయాలనైనా మన్పుతుందిరా? ఇప్పుడు పాతవన్నీ మర్చిపోవాలి," అంది ఆమె బాధగా.

ఏ గాయమైన మానుతుందేమోగాని గుండెకు తగిలిన గాయం మానదమ్మా!" అన్నాడు.

అతని కంఠం ఎందుకో వణికింది.

"నిజమేరా! కాని బాబూ! ఆయన నా భర్త. ఆ బంధం నన్ను వదలదు. మనం వెళ్లాలి. తప్పదు..." సావిత్రికి ఏడుపు ముంచుకొచ్చింది.

తనయుడికేమో తండ్రిముఖం చూడ్డానికి ఇష్టంలేదు, తల్లేమో వెళ్ళి తీరాలని పట్టు పడుతోంది! ఏం చేయాలో తోచక సాలె గూటిలో ఈగలా అతని మనసు కొట్టుకులాడింది.

తల్లి అంతరంగంలో సుడిగుండం విలయతాండవం చేస్తున్నదని చంద్రశేఖర్ గ్రహించాడు. ఎప్పుడూ ఏ కోరికా కోరని తల్లి కోరిన కోర్కెను కాదనడానికి అతని మనసొప్పలేదు.

ఎంత కష్టంలోనైనా నిబ్బరంగా వుండే తల్లి ఏడుస్తూ వుండడం చూసేసరికి అతనికి జాలి కలిగింది.

"సర్లే అమ్మా!" అన్నాడు ప్రక్క గదిలోకి వెళ్ళిపోతూ.

రైల్లో కూర్చున్న చంద్రశేఖర్ కిటికీలోంచి చూస్తున్నాడు.

నీలిమబ్బులు కదిలిపోతున్నాయి. సంధ్య సువర్ణకాంతులు చిందిస్తోంది. టెలీఫోన్ తీగల మీద పిట్టలు బారులు తీర్చి పోతున్న రైలువంక వుత్సాహంతో చూస్తున్నాయి.

'కాసేపట్లో చీకటి పడుతుంది. ఇక చూడాలన్నా ఏమీ కనిపించదు. అంధకారంలో ప్రయాణం' అనుకున్నాడు.

సావిత్రి చలనంలేకుండా చూస్తూ కూర్చుంది. ఆమె మనసులోని ఆలోచనలు రైలుకన్నా వేగంగా కదిలిపోతున్నాయి.

తేనెతుట్టె రేగినట్లు ఆమె మనసులో పాత జ్ఞాపకాలు రేగాయి.

చూస్తుండగానే సంధ్య అనంత ఆకాశంలో అదృశ్యమైపోయింది మనిషి జీవితంలాగే.

లైను బాగుచేస్తున్నారులా వుంది. మేకను మ్రింగిన కొండచిలువలా నెమ్మదిగా కదుల్తోంది రైలు.

తండ్రి జీవితం చివరిదశలో వుందని తెలిసినా ఆయనమీదున్న అసహ్యాన్ని దిగమ్రింగుకొని మామూలుగా వుండడం కష్టమైంది చంద్రశేఖర్‌కి.

మొగుడొదిలేసిన ఆడదానిగా తల్లి, తండ్రిలేని బిడ్డగా తనూ ఎలా జీవించాడో అతనికి బాగా గుర్తుంది. బతికిన బ్రతుకంతా చీకటి.... చీకటి... తీరని వెలితి.... వెలితి...!

పిల్లలంతా హాయిగా నాన్నలతో తిరుగుతుంటే తను బిక్కుబిక్కుమంటూ తనకు నాన్న లేనందుకు తనలో తానే మధనపడిపోవడం, తల్లిని పదే పదే ప్రశ్నించడం.... నాన్న మాటెత్తితే సమాధానం చెప్పలేక తల్లి వెక్కి వెక్కి ఏడ్వడం అన్నీ గుర్తున్నాయి అతనికి.

అందరికీ నాన్నలు వున్నప్పుడు తనకు ఎందుకు లేడనే ప్రశ్నకు సమాధానం దొరక్క ఎంత ఆవేదనపడ్డాడో ఎవరికీ అర్థంకాదు.

నాన్న వున్నాడు బాబూ! అనేది తల్లి అప్పుడప్పుడూ.

అప్పుడు నాన్న దగ్గరకి వెళ్తే బాగుండునని తపించిపోయేవాడు.

పెద్దవాడైనాక అతనికి తెలిసింది.

తండ్రిచేసిన మోసానికి తన తల్లి బ్రతుకు నిప్పులో కాలి బూడిదైందనీ, ఆమె అందం అడవికాచిన వెన్నెలైందనీ, ఆశలన్నీ హరించుకుపోయి కేవలం తన కోసమే నిర్జీవంగా బ్రతికిందనీ....

అతని మేనమామ వివరంగా చెప్పాడు ఒకరోజు అదంతా!

అతని తండ్రి పేరు కృష్ణమూర్తి. కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ వుండేవాడు. సావిత్రి బి.ఎ. చదువుకుంటూ వుంది. ఇద్దరూ ప్రేమించికున్నారు. ఇంట్లోవాళ్లకు చెప్పకుండా రిజిష్టర్ మ్యారేజి చేసుకున్నారు. అంతవరకూ బాగానే వుంది. సావిత్రికి కొడుకుపుట్టాడు. అప్పుడు తెలిసింది అతను చేసిన మోసం. కృష్ణమూర్తికి అదివరకే పెళ్ళయింది. భార్య వుంది. అదంతా ఎవరికీ చెప్పకుండా సావిత్రిని పెళ్ళిచేసుకున్నాడు. ఒకసారి అతని భార్య, మామగారు వచ్చి పెద్ద గొడవచేశారు. అతని ఉద్యోగం మాన్పించి తీసుకెళ్లిపోయారు అంతే! ఆ తర్వాత మళ్ళీ సావిత్రిముఖం చూళ్లేదు.

ఆ తర్వాత సావిత్రి ధైర్యంగా ఒంటరిగానే జీవితాన్ని కొనసాగించింది. అదంతా అతనికి గుర్తుంది.

కృష్ణమూర్తి మోసానికి గురైన సావిత్రికి సంఘం సానుభూతి చూపించలేదు. పైగా హేళనచేసింది. బంధువులు అసహ్యించుకున్నారు. అడుగడుగనా అవమానపరచారు.

ఎండాకాలంలో ఒక చుక్కయినా నీరు లేని చెరువుల్లా గ్రీష్మంలో గడిచాయి తల్లీ కొడుకుల బ్రతుకులు.

అటువంటి మోసగాడు తన తండ్రని చెప్పుకోడానికి ఎంతో సిగ్గుగా వుంది.

కాని తల్లి అదంతా ఎలా మర్చిపోగలిగింది? ఉత్తరం రాయగానే కరిగిపోయింది.

చంద్రశేఖర్ మనసు కుతకుతలాడి పోతోంది.

ఇన్నాళ్ళూ అతని గుండెలో పేరుకు పోయిన తండ్రిపట్ల కసి, ద్వేషం అతన్ని వదలడం లేదు.

తనకు జన్మయిచ్చిన తండ్రి అయితే కావచ్చును. కాని తనను గాలికి వదిలేసి బాధ్యత మర్చిపోయిన మనిషిమీద తనకేం ప్రేమవుంటుంది!

తీరా అక్కడికి వెళ్తే ఆయన మొదటి భార్య, పిల్లలు తన తల్లిని తనను ఎలా రిసీవ్ చేసుకుంటారో?

చంద్రశేఖర్‌కి విసుగ్గా వుంది.

కిటికీలోంచి తొంగి చూశాడు.

లోకాన్ని తన చల్లదనంతో మరిపిస్తున్న చందమామని దెయ్యాల్లాంటి నల్ల మబ్బులు సైనికుల్లా చుట్టేసి వెలుగుని ఆర్పేశాయి.

రైలు గమ్యంకోసం పరుగులు తీస్తోంది.

స్టేషన్లో దిగి రిక్షాలో వెళ్లారు.

రెండంతస్థుల మేడముందు ఆపాడు రిక్షా.

చంద్రశేఖర్ పరిసరాలన్నీ వింతగా చూస్తున్నాడు.

కృష్ణమూర్తిగారి రెండో భార్య వచ్చిందని తెలిసి ఇంట్లో కలకలం చెలరేగింది. అతని బంధువులు, స్నేహితులు సావిత్రిని చంద్రశేఖర్‌ని అప్యాయంగా చూశారు.

సావిత్రిని చూడగానే స్విచ్‌వేస్తే వెలిగిన బల్బులా ఆ ముసలి ముఖం కాంతివంతమైంది. లేవడానికి యత్నం చేస్తుంటే డాక్టర్ వారించాడు.

"సావిత్రీ!..." హీనస్వరంతో అన్నాడు.

కృష్ణమూర్తి ముఖం నెత్తురు లేనట్లు తెల్లగా పాలిపోయి, దీనంగా దైన్యంగా వుంది. బాగా చిక్కిపోయాడు. మెడకి ఏదో పెద్ద కట్టు వుంది.

జీవిత పోరాటంలో అలసిపోయి ఓడిపోతున్నవాడిలా వున్నాడు. చూస్తేనే తెలిసిపోతోంది రోజుల్లో మనిషి అని.

భర్తని ఆ స్థితిలో చూడగానే సావిత్రి గుండె ఝల్లుమంది. తుఫాన్‌లో చిక్కుకున్న పడవలా ఆమె తల్లడిల్లిపోయింది. కళ్ళల్లోంచి కన్నీళ్ళు జలజలమని పొంగి వచ్చాయి.

గాజు గోలీల్లాంటి రెండు కళ్ళు చంద్రశేఖర్ వంక ఆదరంగా చూశాయి.

అతన్ని దగ్గరికి రమ్మని సంజ్ఞ చేశాడు కృష్ణమూర్తి

దగ్గరికి వెళ్ళి నిర్లిప్తతో తలదించుకున్నాడు.

పండిపోయిన ఆకులా రాలిపోవడానికి సిద్ధంగా వున్న కృష్ణమూర్తిని చూస్తే ఎవరికైనా అయ్యో పాపం! అనిపిస్తుంది.

కాని తండ్రి చనిపోతున్నప్పుడు కొడుకు పొందే ఆవేదనకు అతను అతీతంగా వున్నాడు. గుండె స్పందించడం లేదు. గడ్డకట్టుకుపోయింది. ఉక్కుముక్కలా.

ఆ స్థితిలో కూడా కృష్ణమూర్తి చంద్రశేఖర్ని చూసి "నా మీద కోపం గదూ!" అన్నాడు.

అతను సమాధానం చెప్పలేదు.

కృష్ణమూర్తి అతని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"పిచ్చితండ్రి...." అన్నాడు గొణుకుంటున్నట్లుగా.

ఇంతలో దగ్గుతెర వచ్చింది. ఆయాస పడిపోయాడు.

డాక్టర్ వీళ్ళని ప్రక్కకు తప్పుకోమని సంజ్ఞచేశాడు.

మర్నాడే కృష్ణమూర్తి కన్ను మూశాడు శాశ్వతంగా.

"అయిపోయింది.....!" డాక్టర్ అనగానే సావిత్రి గుండె గచ్చుమీద పడిన గాజుబొమ్మలా పగిలింది.

వేదనతో కరిగపోతున్న హృదయాన్ని అదుపులో పెట్టుకోలేక భర్తమీద పడి వెక్కి వెక్కి ఏడుస్తున్న తల్లివంక నిర్లిప్తంగా చూశాడు.

చిత్రం. అతని కళ్ళుగూడా చెమర్చటం లేదు. ఎవరో పరాయి మనిషి చచ్చిపోయినట్లుగా వుంది, అంతే.

కృష్ణమూర్తి ఆ పట్టణంలో ప్రముఖుడే అనిపించింది. ఆయన పోయాడని తెలియగానే జనం గుంపులు గుంపులుగా మేడముందు మూగారు.

అంతిమ యాత్రకు చంద్రశేఖర్ని సారథ్యం వహించమని అడిగినప్పుడు అతనికి ఆశ్చర్యం వేసింది.

"మొదటి భార్యకు కొడుకులు లేరా?" ప్రశ్నించాడు.

"లేరు. ఒక కూతురు వుంది. కాని చనిపోయింది. మొదటి భార్య గూడా పోయింది. ప్రస్తుతం రక్తసంబంధీకులు ఎవరూ లేరు నువ్వు తప్ప...." అన్నాడు లాయరు.

చంద్రశేఖరే కర్మ చేశాడు యాంత్రికంగా.

కృష్ణమూర్తి తన యావదాస్తినీ, సావిత్రి పేరున రాశాడని లాయర్ చెప్పాడు.

చంద్రశేఖర్కి అది సంతోషం కలిగించలేదు. ఇంద్రజాలం చేసినట్లు క్షణంలో లక్షాధికారి అయినా ఆనందం కలగలేదు మనసుకి.

బ్రతికున్నప్పుడు ప్రేమ, ఆదరణ పంచి ఇవ్వలేకపోయిన మనిషి ఎంత ఆస్తి ఇస్తే మాత్రం ఎందుకు?

"అమ్మా! నాకు ఇక్కడ ఏమీ బాగా లేదమ్మా! వెళ్లిపోదాం." అన్నాడు ఒక రోజు.

సావిత్రి ఆశ్చర్యంగా చూసింది.

'అంతులేని ఐశ్వర్యం కూడా కొడుకు కోపాన్ని జయించలేకపోయిందన్నమాట' అనుకుంది.

"నమ్మించి ద్రోహంచేసిన మనిషిని నువ్వు క్షమించగలిగావు గాని నా వల్ల కాదమ్మా. ఈ మేడలు, ఫ్యాక్టరీలు, డబ్బు... ఇవేవీ నాకొద్దు.... నా దారిన నేను పోతాను...." కోపంగా అన్నాడు చంద్రశేఖర్.

సావిత్రికి దుఃఖం వచ్చింది.

"ఒరే బాబూ! ఆయన నమ్మకద్రోహి కాదురా? దేవుడు..." అంది సావిత్రి కన్నీళ్ళు జలజలా రాలుతూ ఉండగా.

ఆశ్చర్యంతో తల్లివంక చూశాడు అతను.

"అవున్రా బాబూ! మనిషి రూపంలో వున్న దేవుడు. నా గౌరవం కాపాడడానికి జనం దృష్టిలో నమ్మక ద్రోహిగా నిలబడిన మహానుభావుడ్రా బాబూ! నిజం తెలిస్తే నువ్విలా మాట్లాడవు. ఇన్నేళ్ళుగా ఆ రహస్యం నా గుండెల్లో భద్రంగా దాచుకున్నాను."

"అమ్మా!..." నమ్మలేనట్లుగా అన్నాడు.

"నిజంరా బాబూ! నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో నా క్లాస్‌మేట్ గోపాలరావుని నమ్మి మోసపోయాను. అతను నన్ను పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. నువ్వు కడుపులో పడగానే భయపడి పిరికివాడిలా పారిపోయాడు. ఎక్కడికి పోయాడో తెలియదు. ఎప్పుడొస్తాడో తెలియదు. అసలు వస్తాడో రాడో కూడా తెలియదు. నాకు దిక్కుతోచలేదు. ఈ సంగతి లోకానికి తెలిస్తే నన్ను ఎంత నీచంగా చూస్తారో వూహించుకుని భయపడిపోయాను. ఆత్మహత్య చేసుకోడానికి నిర్ణయించుకున్నాను. బెజవాడ వరకూ వెళ్ళి రైల్లోంచి కృష్ణలోకి దూకి చావాలనుకున్నాను. చిత్రంగా మా లెక్చరర్ కృష్ణమూర్తిగారు కూడా నేను ఎక్కిన పెట్టెలోనే ఎక్కారు. నా వెంట ఎవరూ లేకపోవడం, కనీసం ఒక బ్యాగ్ గాని సూట్‌కేస్ గాని లేకపోవడం, నేను దీనంగా వుండడం చూసి ఆయన అనుమానించారు. నేను ఆయనకు నిజం చెప్పాను. అప్పుడాయన నాకు ధైర్యం చెప్పారు. నన్ను ఆదుకున్నారు. ఆ నింద తనపై వేసుకున్నారు. ఆయనకు పెళ్ళి అయిందని నాకు తెలుసు. అయినా గౌరవంగా జీవించడానికి లైసెన్స్ కోసం ఆయన్ని పెళ్ళిచేసుకున్నాను.

ఇంట్లో గూడా చెప్పలేదు. రిజిష్టర్ మ్యారేజి చేసుకున్నాం. నేను ఇంట్లోనే వుండేదాన్ని. చదువు పూర్తి అయిందాక అక్కడే వుండనివ్వండి అని మా ఇంట్లో చెప్పారు. ఆయన నన్ను ఎప్పుడూ భార్యలా చూడలేదు. సోదరిలా చూసేవాడు. ఎవరైన సహృదయుడు తారసపడినప్పుడు విడాకులిచ్చి పెళ్ళిచేసుకోమని అనేవారు. కాని నాకు జీవితం మీద మోజు లేకపోయింది. యాంత్రికంగా జీవించాను".

చంద్రశేఖర్ నివ్వెరపోయి వింటున్నాడు అదంతా.

"బాబూ! ఆయన దూరంగా వున్నా ఎప్పుడూ ఉత్తరాలు రాసేవారు. పెళ్ళిచేసుకోమని కోరేవారు. ఆర్థికంగా ఆదుకునేవారు. ఆ రోజు నన్ను పెళ్ళి చేసుకుని నా గౌరవం కాపాడినందుకు నేను జీవితాంతం కృతజ్ఞురాలిగా వున్నాను. ఆ బంధం నేను తెంపుకోలేపోయాను. బాబూ!... ఆయనా అంతే."

తల్లి మాటలు వింటూ వుంటే అతని మనసు గజిబిజిగా అయిపోయింది.

*–యువ మాసపత్రిక, అక్టోబర్, 1983*